# ఇరుకు పదును

నర్సింగరావు చనిపోయి అయిదు నెలలు దాటాయి. అతను చనిపోయిన రోజునే మొదటిసారిగా వాళ్ళింటికి వెళ్ళాను. అప్పుడే అతని భార్య సరస్వతిని చూశాను. మొదటిగదిలోనే ఒక మూలనున్న కుర్చీలో కూర్చుని ఉంది. అతని పార్థివ శరీరం గది చివర్లో ఉంది. తీసుకువెళ్ళిన గులాబీ దండ అతని శరీరం మీద వేసి చేతులు జోడించి సమస్కరిస్తూ నిమిషం పాటు కళ్ళు మూసుకుని అతని ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నాను.

ఆమె కూర్చున్న దగ్గరకు వెళ్దామను కున్నాను. నేను ఎవరో ఆమెకు తెలియక

పోవచ్చు కాబట్టి నన్ను నేను పరిచయం చేసుకుని విచారం తెలియజేద్దామనుకునేంతలో నలుగురైదుగురు ఆడవాళ్ళు ఆమెచుట్టూ చేరేసరికి నా ప్రయత్నం విరమించుకోవలసి వచ్చింది. తర్వాత వీలుకాలేదు. మా ఆఫీసువాళ్ళూ, అతను పనిచేసిన డిపార్ట్‌మెంట్ వాళ్ళు చాలా మంది వచ్చేసరికి ఆమెను కలిసి మాట్లాడలేకపోయాను.

అంతకు ముందు ఏడెనిమిదిసార్లు అతనిని నా కారులో వదిలిపెట్టడానికి వెళ్ళినప్పుడు తన ఇంట్లోకి రమ్మని అతను నన్ను ఎప్పుడూ పిలవలేదు. నా ఇంటికి మట్టుకు చాలాసార్లు వచ్చాడు. ఇంట్లో ఉండేది నేను ఒక్కడినే కాబట్టి అతను ఫ్రీగా మెలిగేవాడు.

ఆఫీసులో భోజన విరామ సమయంలో స్టాఫ్ క్యాంటిన్‌లో భోజనం చేశాక నా గదిలో అరగంటపాటయినా కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్ళం. అతనే ఎక్కువ మాట్లాడేవాడు. నేను అతసంత మాటకారిని కాను. నాకంటే ఏడెనిమిదేళ్ళ చిన్నవాడయినా నాకు దిక్సూచిలా ఉండేవాడు. అతను చనిపోయేనాటికి మంచి హోదాలో ఉన్నాడు. బతికి ఉంటే తేలికగా జనరల్ మేనేజర్ అయి ఉండేవాడు. నా హోదా అతసంత పెద్దది కాదు.

మా సంస్థ లేడీస్ వెల్ఫేర్ సెంటర్ ద్వారా కంపేషనేట్ గ్రౌండ్స్ మీద సరస్వతి కంప్యూటర్ విభాగంలో అప్రెంటిస్‌గా చేరింది. ఆమె చేరిన మూడు వారాల తర్వాత గాని భవాని నాకు ఆ విషయం చెప్పలేదు. భవాని నర్సింగరావుకు దగ్గర మనిషి. ఆమెను నాకు పరిచయం చేసింది అతనే.

అప్రెంటిస్‌లు ఎంత చదువున్నా నాలుగువేల కన్నా ఎక్కువ జీతం ఉండదు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం బ్రేక్ ఇచ్చి తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటారు. సంస్థ బస్సుపాస్‌లు ఉండవు.

నాకు తెలిసి నర్సింగరావు బాగానే సంపాదించాడు. రెండు అపార్ట్‌మెంట్స్ కొన్నాడు. ఒకటి అద్దెకు ఇచ్చి మరొకదాంట్లో తను ఉండేవాడు. ప్రస్తుతం సరస్వతికి పెన్షన్ వస్తూండవచ్చు. బీమా, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ ఎక్కువ మొత్తంలోనే అంది ఉంటాయి. పేరుకు అప్రెంటీసే అయినా ఎక్కువగా అటెండర్ పనులే చేయించుకుంటారు. అన్నీ అమరిన వ్యక్తి అంత చిన్న ఉద్యోగానికి అంత దూరం నుండి ఎందుకు వస్తున్నదో అర్థం కాలేదు. భవానీని అడిగాను. తనకు తెలియదు అంది. భవాని కలుపుగోలు వ్యక్తి అయినా గుట్టు మనిషి. నిజాల గొంతు

నొక్కేస్తుంటుంది. ఆమెకు ముప్పయి సంవత్సరాలు పైబడినా ఇరవై అయిదు సంవత్సరాలు మించనట్లు కనిపిస్తుంది. పెళ్ళి కాలేదు. నాకు అర్థం కాని మరొక విషయం ఏమిటంటే సరస్వతికీ, భవానికీ స్నేహం ఎలా కుదిరిందని? రెండు మూడుసార్లు వాళ్ళు కలిసి తిరగడం చూశాను.

సరస్వతి రెండుసార్లు నా ఆఫీసు గదికి వచ్చింది. కాని గదిలో మరెవరో కూర్చుని ఉండడం వలన లోపలకు రాలేదు. వెళ్ళిపోయింది. నన్ను పలకరిద్దామని వచ్చిందో, నర్సింగరావు గురించి ఏమయినా తెలుసుకుందామని వచ్చిందో తెలియదు. భవానీకి ఫోను చేసి అడుగుదామనిపించినా పనుల్లో పడి మర్చిపోయాను.

మూడోసారి నా గదిలో మరెవరూ లేకపోవడం గమనించి సరస్వతి భవానిని వెంటబెట్టుకుని వచ్చింది. కూర్చోమన్నాను. "టీ తెప్పించమంటారా?" అని అడిగాను. "వద్దు" అంది సరస్వతి. భవాని చేతిగోళ్ళకు ఉన్న రంగులు చూసుకుంటోంది. ఒక్కొక్క వేలికి ఒక్కో రంగు వేసుకుని ఉంది.

"చెప్పండి. ఎలా ఉన్నారు? మీ పిల్లలు ఎలా ఉన్నారు?" అడిగాను.

నర్సింగరావుకు ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి ఇంజనీరింగ్, రెండోవాడు సీనియర్ ఇంటర్ చదువుతున్నారు.

"నేను బావున్నాను. పిల్లలూ బావున్నారు. మీరు నాకో అరగంట సమయమిస్తే కొన్ని విషయాలు మాట్లాడి వెళ్తాను" అంది సరస్వతి.

భవాని ముఖంలోకి చూశాను. ఆమె కళ్ళు బావుంటాయి. వాటిని పక్కకు తిప్పింది. ఎందుకో గంభీరంగా ఉన్నట్టు అనిపించింది.

"మాట్లాడండి" అన్నాను.

సరస్వతి ముఖం ప్రసన్నంగా లేదు. మునుపెన్నడూ ఇవాళంత పరిశీలనగా చూడలేదు. ఎప్పుడూ అంతేనేమో! భవాని నాకు ముందుగా హింట్ ఇచ్చిఉంటే బావుండేది. సరస్వతి తన పర్స్‌లోంచి మూడు తాళంచెవులు బయటకు తీసి బల్ల మీద పెట్టి, నా ముందుకు జరిపింది.

"ఇవి వేటివో చెప్పగలరా?" అడిగింది.

ఒకటి తీసి ఆమెవైపు జరిపి, "ఇది మీ కారుది. స్టెర్లింగ్ టవర్ వద్ద కారు

పార్క్‌చేసి సిటీ బస్సు పట్టుకుని కంపెనీకి వచ్చేవాడు" అన్నాను.

స్టెర్లింగ్ టవర్ నుండి మా కంపెనీ ముప్పయి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ప్రయాణ ఖర్చుల నిమిత్తం నర్సింగరావుకు కంపెనీ నెలకు మూడువేలు ఇచ్చేది. నేను కంపెనీ బస్సు ఉపయోగించుకుంటాను. కాని తను ఉపయోగించు కునేవాడు కాదు.

"వాళ్ళు సమాచారమివ్వగానే డూప్లికేట్ తాళంచెవితో కారు కొద్దిగా బాగుచేయించి ఇంటికి తీసుకువెళ్ళాం. చాలా పార్ట్స్ తీసేశారు. ఎవరు తీశారంటే మాకు తెలియదు అని అక్కడి వాచ్‌మెన్‌లు ఎవరికి వాళ్ళు తప్పించుకున్నారు. ఇంటికి తీసుకెళ్ళాక పూర్తిగా బాగు చేయించాను. ఇప్పుడు బాగానే నడుస్తోంది" అంది.

"మీకు డ్రైవింగ్ వచ్చా?"

తలూపింది. కారు తీసుకువెళ్ళాక ఇంక ఆ తాళంచెవి నాకు ఎందుకు చూపించడం?

"కంపెనీకి కారులో వస్తున్నారా?"

"లేదు. బస్సులో వస్తున్నాను."

"ఈ రెండో తాళంచెవి మీ మోటారు బైక్‌ది. దాన్ని కూడా తెచ్చుకున్నారా?"

"లేదు. ఎక్కడ ఉంది?"

"రైల్వే స్టేషన్ అటుపక్కనున్న స్టాండ్‌లో ఉంటుంది. మీ ఐడెంటిటీ చూపించి అద్దె బకాయి కడితే ఇచ్చేస్తారు. సమస్యేమీ ఉండదు."

"మరి ఇది?"

మూడో తాళంచెవి చేతిలోకి తీసుకున్నాను. పెద్దగా ఉంది. లాకర్ చెవిలా అనిపిస్తోంది. చివర 101 నెంబరు వేసిన నీలం రంగు కాయితం కట్టి ఉంది.

"ఇది లాకర్ కీ అయి ఉండాలి" అన్నాను.

"ఏ బ్యాంకుది అయి ఉంటుంది?"

"నాకు తెలియదు. డబ్బు తాలూకు లావాదేవీలు నాతో ఏనాడూ మాట్లాడలేదు."

"లాకర్‌లో డబ్బులుండొచ్చు కదా?"

"ఉండొచ్చు. డబ్బే కాకుండా నగలు, ముఖ్యమైన డాక్యుమెంట్లు ఉండొచ్చు. బ్యాంకులో అకౌంట్ ఉన్నవారికే లాకర్ సదుపాయం ఉంటుంది. ఏఏ బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నాయో మీ ఇంట్లో పాస్‌బుక్‌లుంటే సరాసరి బ్యాంకు మేనేజర్ల దగ్గరకు వెళ్ళి మాట్లాడితే బావుంటుంది. మీతో కొన్ని విషయాలు దాస్తుండేవాడా?"

"అదేం కాదు" అంది చిన్నగా. నిజం చెప్పినట్టు అనిపించలేదు. తాళం చెవులందుకుని పర్సులో వేసుకుంది.

"మీ అంత దగ్గరగా ఆయనకు స్నేహితులు ఉండేవారా?"

"ఉండొచ్చేమో. నేను అడగలేదు. ఆయన చెప్పలేదు."

పర్సు మళ్లీ తెరిచి రెండు ఉత్తరాలు తీసి నాకు అందించి, "ఇవి ఎవరు రాసినవో చెప్పగలరా?" అడిగింది.

అవి ప్రేమలేఖలు. రెండూ ఒకరు రాసినవి కావు. రెండింటిలోనూ రాత చక్కగా ఉంది. ఎవరికి సంబోధిస్తూ రాసారో పేర్లు లేవు. అలాగే చివర్లో సంతకాలు లేవు. చదవాలనిపించలేదు. ఆ ఉత్తరాలు తిరిగి ఆమెకు ఇచ్చేసాను. ఆమె మడతలు పెట్టి పర్సులో పెట్టుకుంటూంటే భవాని వంక చూశాను. తల అడ్డంగా ఆడించింది. ఆ విషయంలో ఏమీ చెప్పవద్దని ఆమె నన్ను ప్రాధేయపడినట్లుగా అందులో సంకేతం ఉంది.

"మీ ఆయనకు స్నేహితురాళ్ళు ఉన్న విషయం నాకు తెలియదు" అన్నాను.

"మీకు తెలియదంటే నమ్మాలనిపించడం లేదు. ప్రతిరోజూ మీరు మాట్లాడుకునేవాళ్ళు కాదా?"

"ప్రతిరోజూ..." జవాబు చెపుతుండగానే నా మాటలకు అడ్డు వచ్చి, "మీ ఇద్దరూ ఏ విషయాల గురించి మాట్లాడుకునేవాళ్ళు?" అడిగింది.

ఆమె స్వరంలోని కాఠిన్యానికి నా సహనం నశిస్తోంది.

నిగ్రహించుకుంటూ నెమ్మదిగా, "ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకునేవాళ్ళం" అన్నాను.

"అంతేనా?" నవ్వు ముఖంతోనే అడిగింది.

కుర్చీలో అసహనంగా కదిలాను.

"ఆడవాళ్ళ గురించి ఏం మాట్లాడుకునేవాళ్ళు కాదా?"

ఏమని జవాబు చెప్పాలో అర్థం కాలేదు. నేను ఏమీ చెప్పకపోయేసరికి, ఆమే అంది, "సహజం కదా."

"వెల్. నాకంటే భార్య లేదు..." ఆగాను.

"మీ అంత దగ్గర స్నేహితులు ఆయనకు ఉన్నారా?" మళ్ళీ అడిగింది.

"ఆయన డిపార్ట్‌మెంట్ ఫ్యాక్టరీలో ఉంటుంది. అక్కడ ఎవరైనా ఉండొచ్చు. కాని తన స్నేహితుల గురించి నాతో ఎప్పుడూ చెప్పలేదు..." అంటున్నాను.

నా మాటలకు అడ్డు తగులుతూ, "మీరెందుకు పెళ్లి చేసుకోలేదు?" అడిగింది.

భవాని సరస్వతి చేతి మీద తన చేయి ఉంచి, "కారు ప్రమాదంలో సార్ భార్య, పిల్లలిద్దరు చనిపోయి పదేళ్ళు అయింది. మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు" అంది.

"సారీ. అయాం సారీ" అంది సరస్వతి.

చేతి గడియారం వంక చూసుకున్నాను. మా సంభాషణ అంతటితో ఆగిపోతే బాపుణ్ణు అనుకున్నాను. కాని ఆమె సందేహాలు పూర్తిగా తీరినట్టు అనిపించడం లేదు. పొరపాటున ఏ మాట జారతానో?

"ఆయన ఎడ్వంచర్స్ గురించి మీకు ఎంతో కొంత తెలిసి ఉండాలి" పట్టు వదలకుండా అంది.

అటో ఇటో తేల్చుకోవడానికే వచ్చినట్టుంది. ఏం చెప్పబోయి ఏం చెపుతానో? బల్లమీదున్న గ్లాసు అందుకుని మూత పక్కన పెట్టి నీళ్ళు తాగాను. గ్లాసు మళ్ళీ బల్లమీద పెట్టాను.

"ఏడ్వంచర్స్ అంటే?" అడిగాను.

జవాబుగా రెండు ఫోటోలు తీసి నా ముందు ఉంచుతోంటే భవాని

ముఖంలోకి చూశాను. మూడు నాలుగు క్షణాలపాటు భవాని కళ్ళు మూసుకుంది. భవానీకి నామీద నమ్మకం సడలుతూ ఉండొచ్చు. ఆ ఫోటోలు నర్సింగరావు ఎందుకు భద్రంగా ఉంచుకున్నాడో, అవి సరస్వతి చేతుల్లోకి ఎలా వచ్చాయో అర్థం కావడం లేదు.

"ఇలాంటివి... ఇవి ఎవరివో చెప్పగలరా?"

తల అడ్డంగా ఆడించి, "తెలియదు" అన్నాను. భవాని ముఖంలోకి మళ్ళీ చూడదల్చుకోలేదు. సరస్వతి అరచేతులు తెరిచి నా కళ్ళలోకి చూస్తూ అడిగింది. "నేనాయనకు ఏం తక్కువ చేసానని?"

ఆ ప్రశ్నకు నా దగ్గరేం జవాబు ఉంటుంది?

*ఆదివారం 'ఆంధ్రజ్యోతి', 18 మే, 2014*